బంగారు పిడకలు

శ్రీ కలువకొలను సదానంద

మంగపతిగారి ఆస్తికి అంతూ పొంతూ లేదు. అన్నీ బంగారు గుడ్లు పెట్టే బాతులే! బెల్లంమండీ బియ్యపుమర, లారీలూ బస్సులూ, ట్రాక్టరూ థియేటరూ, గొడ్లూ గోడౌన్లూ, భూములూ భవనాలూ, ఇలా సాగిపోయే ఈ జాబితాలో బంగారక్క పేరుకూడా వస్తుంది.

మంగపతిగారి పాలిటికి బంగారంలాంటి బంగారక్క బంగారపు తీగలా మాత్రం వుండదు. వంగిపోయిన ఎండుపుడకలా వుంటుంది. తల ముగ్గు బుట్టలా వుంటుంది. చర్మమంతా ముడతలు. ఒళ్ళంతా మురికి. ఆ బంగారక్క మంగపతిగారి ఆస్తి. ఆయన బ్రతుకులో బంగారం పండించే డెల్టా.

మంగపతిగారి పెళ్ళామూ, కోడలూ పట్టుపీతాంబరాలు కట్టుకుంటారు. బంగారక్కమాత్రం ఏడాది పొడుగునా ఒకేఒక చింకికోక కట్టుకుంటుంది. రవిక తొడుక్కోదు. వాళ్ళంతా సుగంధ తైలాలు వాడుకుంటే, బంగారక్క తల మాత్రం జడలు గట్టుకు పోయింది. వాళ్ళంతా పంచభక్ష్య పరమాన్నాలు తింటారు, బంగారక్కకు పొట్టనిండా చద్దికూడు, పాసిన కూరా పెడతారు. వాళ్ళు పంకాలకింద పట్టు పరుపులమీద పవ్వళిస్తే, బంగారక్క గొడ్లచావడిలో పడుకుని గురకపెట్టి నిద్రపోతుంది. వాళ్ళు అసలు పూచిక పుల్లయినా ముట్టుకోరు. పనులన్నీ నౌకర్లకూ చాకర్లకూ అప్పజెప్పి రేడియోగ్రాం పక్కన కూచుంటారు, సినిమా హాల్సులో కూచుంటారు, గీతోపదేశం చేయవచ్చిన స్వాములవారి పాదాలచెంత కూచుంటారు. బంగారక్కమాత్రంఎప్పుడూ ఎక్కడా అలా కూచోదు. మంగపతిగారి బస్సులాగా, లారీలాగా, ట్రాక్టరు లాగా, బియ్యం మరలాగా కదుల్తూనే వుంటుంది.

విచిత్రం ఏమంటే, ఈ తేడాలను గురించి బంగారక్క కలలో కూడా ఆలోచించదు. తాను గొడ్డులా బ్రతుకుతున్నాననే ధ్యాసే ఆమెకులేదు. ఆ యంత్రానికి ముక్కడం మూలగడం తెలియదు. ఆ మరబొమ్మకు ఠంగా బెగులూ లేనేలేవు. పువ్వుల్ని కుంపటిలోవేస్తే అవి మాడి మసి అయిపోతాయి. బంగారక్క కుంపటిలో వికసించే పువ్వు.

ఊరిమధ్యలో మెయిన్ రోడ్డుకు యివతల ఎలిమెంటరీ స్కూలు వుంది. స్కూలుకు ఎదుట-రోడ్డుకు అవతలివైపున మంగపతిగారి మేడ, మేడ పక్కన గడ్డివామి, గొడ్లపాక వున్నాయి. ఆ పాకలో నాలుగు పాడి గేదెలు, రెండు ఆవులూ వున్నాయి. అవి మంగపతిగారివి.

ఆ పాకలోనో, పాక దరిదాపుల్లోనో బంగారక్కను ఎప్పుడైనా చూడవచ్చు. పశువుల్ని గుంజకు కడుతూనో, విప్పుతూనోవుంటుంది. వాటి పేడ పోగుచేస్తుంది. పిడకలు తడుతుంది. ఎండనపిడకల్ని గోతాల్లో నింపుతుంది. గడ్డిదులిపి గొడ్లకు వేస్తుంది. పాకలోని చెత్తాచెదారమంతా ఊడుస్తుంది. ఇళ్ళిల్లూ తిరిగి కుడితినీళ్ళు తెస్తుంది. అన్నంవేళకు మంగపతిగారింటి ముందునిలిచి, కలో గంజో మూకుడులో పోయించుకుని కడుపు నింపుకుంటుంది. పొద్దుపోయాక మట్టినేలే మెత్తపరుపుగా, దోమల సంగీతమే జోలపాటగా, పేడకంపే ఊదొత్తుల వాసనగా, చింకిదుప్పటి దోమతెరగా-ఆ పాకలోనే పడుకుంటుంది. నిద్ర ఆమె కళ్ళలో బసచెయ్యటానికి ముందుక్షణం ఆమెకెలా వుంటుందో తెలుసా? పోనీ, బెల్లం వ్యాపారంలో మంగపతిగారికి లక్షరూపాయలు లాభం వచ్చినప్పుడల్లా అతనికెలా వుంటుందో తెలుసా? ఈ రెండు ప్రశ్నలకూ జవాబు ఒకటే!

మంగపతిగారి మేడ, ఆ గొడ్లపాక, ఆ పరిసరాలంతా ఒక లంక అనుకుంటే, బంగారక్క ఆ లంకలో ఈగనైనా వాలనివ్వని లంకిణి. తక్కిన ప్రపంచంతో ఆమెకు సంబంధమేలేదు. రోడ్డుమీద గేదెలు నెమరువేస్తూ కూర్చున్న సమయాల్లో - కన్నూమిన్నూ కానక పరిగెత్తే లారీలను, బస్సుల్నీ శాపనార్థాలు పెడుతు వుంటుంది ఆమె. బడిపిల్లలెవరైనా పోతూ పోతూ, అడ్డంగావున్న ఆ పశువుల్ని తోక మెలిపెడితేనో, వీపుమీద చరిస్తేనో, "ఒరే మీకు దూము తగల! నోరులేని గొడ్డు ఏం జేసిందిరా నిన్ను?" అని తిట్టిపోస్తూ వుంటుంది. పాకదగ్గరగానీ, మంగపతిగారి మేడదగ్గరగానీ ఏ కుర్రవెధవో ఒంటేలు పోసుకుంటూ ఆమెకంటబడ్డాడో, స్వర్గలోకసౌఖ్యాల్లో తేలిపోతున్న వాడి తాతముత్తాతలు కూడా పుటుక్కుమంటూ వూడి, నరకంలో పడిపోవాల్సిందే!...విశ్వాసానికి మారుపేరు కుక్క అన్నారు. కుక్కలలో కూడా మేలుజాతులున్నాయికదా? బంగారక్కది మరీ మేలుజాతి. అయితే ఆమె మంగపతిగారి మేడలోకి ఎప్పుడూ వెళ్ళలేదు. మంగపతిగారి పెంపుడుకుక్కమాత్రం యిల్లంతా కలయదిరుగుతూవుంటుంది.

బంగారక్క మంగపతిగారి చుట్టంకాదు. అయితే ఆమెకు అయిన వాళ్ళెవరూ లేరా అంటే, వున్నారు. పూర్వంనుంచీ ఆమెను ఎరిగివున్న వాళ్ళు ఓబులేశును గురించి చెడ్డగా చెప్పుకుంటారు. కన్నతల్లిని మరిచిపోయిన కఠినాత్ముడనీ, ముసలితనంలో దాన్ని యింట్లో పెట్టుకుని యింత గంజి పొయ్యలేక, వీధుల్లో వొదిలేశాడనీ అంటుంటారు. అది నిజంకాదు. బంగారక్క యింత గంజితాగి యింట్లో పడివుండక వీధుల్లో వుండడం మాత్రం నిజమే!

ఈ ఓబులేశు తన పెళ్ళాంతో, ముగ్గురు పిల్లలతో ఊరి చివరవున్న ఒక పల్లెలో వుంటున్నాడు. అతడి తలిదండ్రులిద్దరూ మంగపతి నీడలో పనీపాటూ చేసుకుంటూ బ్రతుకుతుండేవారు. పదేళ్ళ క్రిందట ఓబులేశు స్కూల్‌ఫైనల్ చదువుతుండగా, తండ్రి పోయాడు. తల్లి బంగారక్క మంగపతి కుటుంబానికి చాకిరీ చేస్తూనే కొడుకు చదువుకాస్తా పూర్తిచేయించింది. స్కూల్ ఫైనల్ ప్యాసయిన ఓబులేశు టీచర్స్ ట్రెయినింగుకూడా పూర్తి చేసి, ఆతరవాత కొంతకాలానికి ఆ ఊళ్ళోనే, ఆ స్కూల్లోనే ఉద్యోగం సంపాదించుకున్నాడు. తల్లికి నచ్చజెప్పి, మంగపతిగారింట్లో పని మానెయ్య మన్నాడు. మంగపతి కుటుంబంలోని వాళ్ళదగ్గర ఆమెకు మొహమాటం ఎక్కువ. నీళ్ళు నములుతూ, ఆమె, కొడుకు చెప్పమన్నమాట చెప్పగనే, కొండంత ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంది మంగపతిభార్య.

"ఏందే నువ్వనేది! నిన్నూ, నీ మొగుణ్ణీ సాకి, నీ కొడుకును చెట్టంతవాణ్ణి జేస్తే, యిప్పుడు పనిజెయ్యనంటావా? నీకు కొంచెమైనా విశ్వాసం వుందా?" అంటూ దెప్పింది. యుగ యుగాలుగా భూదేవిని నెత్తిమీద పెట్టుకుని మోసిన ఆదిశేషుడు, యికనేను మోయలేనంటే, భూదేవి అవాక్కయిపోదూ?

"నా కొడుకు వొద్దంటా వుండాడమ్మా! వాడికి అయివోరు పనొచ్చిందిగదా?..." అంది బంగారక్క.

"అంతేలేయే! అక్కరగీరితే అక్కమొగుడు కుక్క" అంటూ నిష్ఠూరమాడింది మంగపతిభార్య

ఉద్యోగం వచ్చిన రెండు నెలలకే, ఓబులేశు మేనమామ, అతడికి తనకూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు. కోడలు కాపురానికి రాగానే, బంగారక్క గుండెల్లో మొలిచినవన్నీ ముళ్ళచెట్లే. కోడలు గన్నేరు ఉత్తమురాలు కాదు. అత్తలేని కోడలే ప్రపంచంలో ఉత్తమురాలు గన్నేరుకు అత్తవుంది కదామరి! ఆ కోడలు ఏమాట మాట్లాడినా, ఈ అత్తకు ఆమాటలు ఎగిపొడుపులుగానే వుండేవి. పిల్లిమీద, కుక్కమీద సాకుపెట్టి తనను దెప్పుతున్నట్లే అనిపించేది. పొద్దస్తమానమూ ఇరుగింటి ఎల్లమ్మతోనో, పొరుగింటి పుల్లమ్మతోనో కోడల్ని గురించి చాడీలు చెప్పకపోతే, ఆమెకు రోజు గడిచేదికాదు. ఇంట్లో జగడాలాడినప్పుడు, అలిగినప్పుడు, విశేషంగా మంగపతిభార్య దగ్గరికివెళ్ళి, సోదె చెబుతూవుండేది. మంగపతిభార్య అగ్నిలో ఆజ్యం పోస్తూవుండేది. "అదేమిటే, అట్లాంటి కోడల్ని దెచ్చుకుంటివి! నేను చెబుతున్నాకదా, అది నీకు కూడుబెట్టదు. ఆఖరికి నీ చేతికి చిప్పేగతి!" అనేది. "ఇప్పుడు మాత్రం ఏం కొంప మునిగిపోయింది? దాని దగ్గిర మాటలనిపించుకుని, దాని కాళ్ళకాడ పడివుండాల్సిన రాత నీకేమొచ్చింది? ఇంతకాలమూ వాళ్ళకూడేనా తిని బతికినావు! మేము చచ్చినామనుకుంటివా?" అని భరోసా యిచ్చేది.

ఓరోజు అత్తాకోడళ్ళమధ్య మాటామాటా పెరిగి, కోక మడిచి చంకన బెట్టుకుని, మంగపతి యింటికొచ్చేసింది. బంగారక్క తల్లి మూర్ఖత్వంతో ఓబులేశుకు తల బట్టకట్టిపోయింది. అయినా అతడు ఆమెను బతిమాలుకున్నాడు. "అమ్మా! నీకిదేం ఖర్మమే? గతిలేని దినాల్లో మన రెండు పొట్టలకోసరం రెక్కలు ముక్కలు జేసుకుంటివి. ఇప్పుడు నేనేదో నాలుగు రాళ్ళు సంపాయిస్తా వుండాను గదా? ఈ ముసిలితనంలో నీ కెందుకే ఈ వెట్టిచాకిరీ?... నీ కోడలు నిన్నేమన్నా అంటే నాతో జెప్పు. దవడపండ్లు రాలగొడతాను. అంతే గానీ, యిట్లాంటి పనులు చెయ్యొద్దే! నీ ఒళ్ళూ చెడిపోతుంది, నా పరువూ పోతుంది. నడమధ్య నోళ్ళకు లాభం! ఇంటికి రాయే!" అని గడ్డం పట్టుకున్నాడు.

"నన్ను ఆ యింటికి పిలవొద్దురా నాయనా! దానికీ నాకు కుదరదు. నేను జస్తే, వొచ్చి అంత మన్నేసేసిపో, సాలు!" అందిబంగారక్క.

అంతే! ఆ రోజునుంచీ ఆ గొడ్లపాకే ఆమెకు మకాము. ఉద్యోగం కత్తికోతగా తయారయింది ఓబులేశుకు. అతడ కళ్ళఎదుటే ఆ పనులన్నీ చేస్తూ వుంటుంది ఆమె. మంగపతి యింట్లోని వాళ్ళంతా ఆమెను "ఒసే బంగారూ!" అని పిలుస్తుంటారు. మంగపతిగారి మనవలూ, మనవరాళ్ళూ కూడా అలాగే పిలుస్తుంటే, తన చెవులతో విన్నాడు. "సార్! ఆ ముసిలామె మీ అమ్మనా సార్?" అని కొందరు బడిపిల్లలు అతన్నే అడిగారు. తలతీసేసినట్లయింది ఓబులేశుకు. తల్లిని యింటికి రమ్మని మాటిమాటికీ ప్రార్థించాడు. అతడి ప్రార్థన బూడిదలో పోసిన పన్నీరయింది. ఆమెను వశపరచుకునే శక్తి మంగపతి యింట్లో వాళ్ళ తీయని పలకరింపులకు మాత్రమే వుంది.

ఇక విధిలేక, రెండుమైళ్ళ దూరంలోని ఒక చిన్న పల్లెకు బదిలీ చేయించుకున్నాడు ఓబులేశు. ఉదయం వెళ్ళడం, సాయంకాలం యింటికి తిరిగి రావడం. తల్లి పనిచేస్తున్న వీధిలో నడిచి వెళ్ళాలన్నా అతనికే సిగ్గే. ఆమెమీద అసహ్యపడుతున్నాడతను. చాకిరీ చేస్తున్న తన తల్లి మనస్తత్వం, తన తల్లిచేత చాకిరీ చేయించుకుంటున్నవాళ్ళ మనస్తత్వం అతనికి బాగా అర్థమైనాయి. ఆ ఘరానా పెద్దలు చాలా తెలివైనవాళ్ళు. మన వేలితోనే మన కళ్ళు పొడిచేవాళ్ళు. తన తల్లికి అది తెలియదు, ఆమె వట్టి మూర్ఖురాలు. మానసిక దాస్యానికి మరో పేరు స్వామిభక్తి అంటే, ఆ స్వామిభక్తి పూజింపరానిదీ, క్షమింపరానిదీ!

ఓబులేశుకు హృదయకంటకంగా, పదేండ్లనుంచీ జరుగుతున్న కథ యిది. ఈ కథకు ముగింపేలేదా? రోజులు ఆగవు. ముగింపు వుందన్న ఆశ ఓబులేశు గుండెలో అంకురించే రోజులు దగ్గరపడ్డాయి.

రోగమూ రొచ్చూ ఎరుగని బంగారక్కకు జబ్బుచేసింది. మంగపతి యింట్లోనివాళ్ళు రెండురోజులపాటు ఆమెను గురించి పట్టించుకోనేలేదు. పట్టించుకోవటానికి ఆమె వాళ్ళ పెంపుడు కుక్కకాదు, పాలిచ్చే గొడ్డూకాదు. మూడోరోజున పాకలో ముడుక్కున్న బంగారక్క పైకిలేవనే లేదు. ఇక బ్రతకదు అని నమ్మకం ఏర్పడిన నిమిషంలో, క్షణాలమీద ఓబులేశుకు కబురు వెళ్ళింది. అతడు వెంటనేవచ్చి, ఆమెను యింటికి మోసుకుపోయాడు. డాక్టర్ని తీసుకొచ్చాడు. సూదులు వేయించాడు. మందులూ కొన్నాడు. వారం

రోజు పాటు ఒళ్ళు తెలియనితీరులో పడివున్న అస్థితకు ఆ కోడలు చేసిన సేవల్ని చూసి మాలపల్లిలోని వాళ్ళంతా వేనోళ్ళ మెచ్చుకున్నారు. బతికి బయటపడిన బంగారక్కకు కోడలిమీద సముద్రమంత వాత్సల్యం పుట్టుకొచ్చింది. ఓరోజు ఉదయం, నీరసం కాస్త తగ్గి, మాటాడే ఓపిక రాగానే, "ఒసే గన్నేరూ!" అంది. అంత మృదువుగా కొడుకును కూడా ఎప్పుడూ పిలిచి వుండదు.

" మత్తా?" అంది కోడలు.

"పాపం, బిడ్డలు కలిగినోడు! మందులకూ, మాకులకూ ఎన్ని తంటాలు పడినాడో, బిడ్డ!" అంది బంగారక్క.

"అప్పుజేసినాడు."

బంగారక్క కొంతసేపు మౌనంగా వుండి "ఒసే! గుడ్డ పేలికలో కొంచెం డబ్బు కట్టి పెట్టినాను. పోయి తెచ్చుకమని చెప్పు వాడితో!" అంది.

"ఎక్కడుంది?"

"పిడకల గోతంలో!"

"పిడకలగోతం ఎక్కడుంది?"

"అక్కడ్నే! ఆ గొడ్లసావిట్లో!"

"ఎంతుందత్తా ?"

"నూరు రూపాయలకంటే తక్కువగానే వుంటుంది"

అప్పుడు ఓబులేశు యింట్లో లేడు బడికి వెళ్ళిపోయాడు.

గన్నేరు వెంటనే వెళ్ళింది మంగపతిగారింటికి. ఆ యింటి ముందు ఎవరో ఆఫీసర్లు, పోలీసులూ వున్నారు బయటి వసారాలోనే కనిపించారు మంగపతిగారు. గన్నేరును చూసి, 'ఏమి' టన్నట్లు కన్నెగరేశాడు.

"మా అత్త ఏందో డబ్బు దాచిపెట్టిందట సామీ! ఎత్తుకుందా మనొస్తిని!"

"ఎక్కడ దాచిపెట్టింది ?" అని ఉరిమాడు మంగపతి.

"గొడ్లసావిట్లో—పిడకల గోతంలో."

మంగపతినోట్లో తడారిపోయింది. "రేపు రాపో! పనుందిప్పుడు..." అన్నాడు కంగారుగా.

అంతే ఆ మాటతోబాటుగా గొడ్లపాకమీద దాడిచేశారు అధికారులూ, పోలీసులూ. అందులోవున్న పిడకలగోతాలు రెండిట్నీ తిరగేశారు. ఒక గోతంలో బంగారక్కడబ్బు. మరోగోతంలో మంగపతిగారి వెండి బంగారాలు, నోట్లకట్టలూ, ప్రామిసరీనోట్లూ బయటపడ్డాయి.

ఆ తరవాత అందరికీ తెలిసిన విషయమేమంటే తనయింటిని పోలీసులు సోదా చేస్తారని ముందే పసిగట్టిన మంగపతి – లెక్కకు మించిన సొమ్మునంతా క్రితం రాత్రి తీసుకెళ్ళి, పిడకల గోతంలో దాచాడు. పోలీసులు సోదా పూర్తిచేసి, వుత్తచేతులతో తిరిగి పోబోతున్న సమయంలో, గన్నేరు వెళ్ళింది. లేకపోతే, వాళ్ళు పిడకల గోతాల జోలికి వెళ్ళివుండేవాళ్ళేకాదు.

ఒళ్ళు నయమైన తరవాత బంగారక్క మంగపతిగారింటికి వెళ్ళింది. "ఎందుకొస్తివే ?" అని తోక తొక్కిన తాచులా లేచింది మంగపతిభార్య.

"గొడ్లను చూసిపోదామనొస్తినమ్మా! రెండు వారాల కింద బడిపోతినా, అవి ఎట్లా అల్లాడిపోయినాయో ఏమో..."

బంగారక్కమాట పూర్తికానేలేదు. "కొంపంతా కొల్లబెడితివి చాలదూ ? మళ్ళావొస్తివా ? గొడ్లసావిట్లోనే చంపేసివుంటే బాగుండేది..." అంటూ తాటకిలా పైనబడింది మంగపతిభార్య.

తేనెలోపడ్డ ఈగ—ఈవిధంగా బయటపడింది.

ఈ ఉదంతం విని, తన తల్లిని సంతోషపెట్టే పనిఒకటి చెయ్యాలనుకున్నాడు ఓబులేశు. కోరికలీర్చే కల్పతరువులా 'తథాస్తు' అంది, ఆవూళ్ళోని బ్యాంకు.

ఓరోజు ఉదయం ఆమె కళ్ళు తెరవగానే, వాకిట్లో కనిపించిందేమిటీ? కామధేనువులా మంచున్న ఓ పాడిగేదె. "ఎవర్దిరా యిది?" అంది చేటంత ముఖంతో.

"నీదేనే!" అన్నాడు ఓబులేశు.

బంగారక్క పేడపిసికి పిడకలు తడుతున్నప్పుడు "బంగారు పిడకలు తడతా వుండావా బంగారక్కా?" అంటుంటారు యిప్పటికీ ఆ మాలపల్లిలోనివాళ్ళు.

అవి బంగారు పిడకలైనా కాకపోయినా, ఆయింట్లో బంగారు పిడకల కంటే ఎక్కువ విలువ-బంగారక్కకే!